నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 28 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI



సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, చిత్రంలో కంచర్ల రామకృష్ణారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు

- 400మందికిపైగా అన్నదాతల ఆత్మహత్యకు కారణం
- అన్ని పంటలకు బోనస్ వర్తింపజేయాలి
- అందరికీ రైతు భరోసా, రుణమాఫీ చెల్లించాలి
- బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల ప్రారంభ సూచికగా హనుమకొండలో నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం భువనగిరిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆలేరు నియోజకవర్గ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆలేరు నియోజవర్గం నుంచి 600 సొంత వాహనాలు, 200 బస్సుల్లో శ్రేణులు తరలివెళ్లాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పాలన ఎంత దుర్భరంగా ఉందో హన్మకొండ సభ చాటి చెబుతుందన్నారు. కాంగ్రెస్ ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. అధికారిక లెక్కల ప్రకారమే రాష్ట్రంలో 400 మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, అనధికారికంగా ఇంకెంతో మంది ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లో ఓల్టేజీ కరెంట్‌తో వ్యవసాయ మోటార్లు కాలిపోయి రైతులు మరింత నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ఎరువులు లేక, పండిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సాగు, కరెంటు సరిగ్గా లేక పంటలు ఎండిపోతుంటే పట్టించుకోకుండా రేవంత్‌రెడ్డి అవహేళనగా మాట్లాడుతున్నారని, ఆయన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఎండలకు పంటలు ఎండిపోయాయని మాట్లాడడం సరికాదని అన్నారు. రైతులకు ధైర్యం చెప్పాల్సిన ప్రభుత్వాలే వారిని మనోవేదనకు గురిచేసేలా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రుణమాఫీపై కాకి లెక్కలు పక్కనపెట్టి.. అర్హులందరికీ రుణమాఫీ డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు పథకం కింద రైతులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల కోరారు. ఎన్నికల ముందు అన్ని పంటలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక కేవలం సన్నవడ్లకు మాత్రమే ఇస్తామనడం దుర్మార్గమన్నారు. అన్ని పంటలకు రూ.500 బోనస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సంబంధించి ఉగాదిలోగా మంచి నిర్ణయం తీసుకోకపోతే, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలి ప్రజా సమస్యలు, హామీల అమలుపై ప్రశ్నించిన విపక్ష, ప్రజా సంఘాల నాయకుల నిర్బంధంపైనే ప్రభుత్వం ఫోకస్ పెట్టిందన్నారు. సివిల్ వ్యవహారాల్లో పోలీసులు మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కర్రె వెంకటయ్య, పోలగాని వెంకటేశ్ గౌడ్, బీసు చందర్ గౌడ్, మహ్మద్ ఖలీల్, సటి తిరుమలేశ్, పిన్నపరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు తోటకూర అనురాధాబీరయ్య, పల్లా వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీలు ఇందిరాసత్యనారాయణరెడ్డి, బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ఇమ్మడి రామిరెడ్డి, మొగలుగాని మల్లేశ్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఎంజీయూలో చెలరేగిన మంటలు

పరీక్ష విభాగం నుంచి ఇంజినీరింగ్ కాలేజ్ వరకు కాలిపోయిన చెట్లు

ఎంజీయూలో మంటల్లో కాలిపోతున్న చెట్లు

రామగిరి , మార్చి 27 : నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో గురువారం రాత్రి మంటలు చెలరేగాయి. పరీక్షల విభాగం పరిసరాలు మొదలుకుని ఇంజినీరింగ్ కళాశాల వరకు సుమారు 120 ఎకరాల్లో ఉన్న చెట్లు దగ్ధమయ్యాయి. యూనివర్సిటీ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది నల్లగొండ అగ్నిమాపక స్టేషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ శాఖ సిబ్బంది వచ్చి 3 ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. గతంలోనూ పలుమార్లు యూనివర్సిటీలో మంటలు చెలరేగడంతో వందల వేప మొక్కలు, పండ్ల చెట్లు కాలి బూడిదయ్యాయి.

ఎండుతున్న ఎర్రంబెల్లి

చుక్క నీరు లేక అన్నదాత అరిగోస

పక్కనే కాళేశ్వరం కాల్వ, బునాదిగాని కాల్వ ఉన్నా నీళ్లు కరువు

పశువులకు మేతగా ఎండిన పంటలు

చేతికొచ్చే దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు

ట్యాంకర్లతో నీటి తడులు ఇస్తున్న రైతులు

ఊళ్లో తాగునీటికీ తండ్లాటే..

యాదాద్రి భువనగిరి, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : భువనగిరి మండలంలోని ఎర్రంబెల్లి గ్రామంలో నీటి కోసం అల్లాడుతున్నది. సాగునీరు లేక ఎక్కడ చూసినా పొలాలు నెర్రెలు వారుతున్నాయి. చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోతున్నాయి. ఎక్కడైనా కొద్దొగొప్పో ఆశాజనకంగా ఉన్న పొలాలను కాపాడుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. తలాపున కాళేశ్వరం కాల్వ, బునాదినాని కాల్వ ఉన్నా నీళ్లు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మరోవైపు గ్రామంలో తాగునీరు, గృహ అవసరాలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు.

భువనగిరి మండలం ఎర్రంబెల్లిలో వాటర్ ట్యాంకర్లతో పొలానికి నీళ్లు పెడుతున్న రైతులు

ఎర్రంబెల్లి గ్రామంలో 200 వరకు కుటుంబాలు ఉన్నాయి. 600 వరకు జనాభా ఉంది. ఈసారి వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో రైతులు సాగుకు వెనుకంజ వేశారు. అనేక మంది నాలుగు మడులకు బదులు ఒక మడి మాత్రమే చేశారు. భూగర్భ జలాలు వేగంగా పడిపోవడంతో బోర్లు, బావులు ఎండిపోయాయి. దాంతో సాగు చేసిన అరకొర పంట కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అనేకమంది కొత్తగా బోర్లు వేసినా చుక్క నీరు పడడం లేదు. ఫలితంగా ఎకరాలకు ఎకరాలు ఎండిపోయాయి. చేసేది లేక రైతులను పంటలను పశువుల మేతకు వదిలిపెడుతున్నారు. ఇంకొంతమంది రైతులు చివరి ప్రయత్నంగా ట్యాంకర్లతో నీళ్లు పెడుతున్నారు. వారం, పది రోజులు నీళ్లు అందిస్తే పంట చేతికి వస్తుందనే ఆశతో ఒక్కో ట్యాంకర్‌కు రూ.500 నుంచి 800 రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారు.

తాగునీటికీ కష్టాలే..

గ్రామంలో తాగు నీరు, ఇతర అవసరాలకు సైతం అవస్థలు తప్పడం లేదు. గతంలో నీటి సరఫరా బాగానే ఉండేదని, ఇటీవల సరిగ్గా లేదని గ్రామస్తులు చెబుతున్నారు. రెండు, మూడు రోజులకోసారి నీళ్లు వదులుతున్నారని, రెండు, మూడు బిందెలు కూడా రావడం లేదని వాపోతున్నారు. దాంతో అనేక మంది ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్న పరిస్థితులు ఉన్నాయి.

భువనగిరి మండలం ఎర్రంబెల్లిలో ఎండిపోయిన పొలాన్ని చూపిస్తున్న యువరైతు మల్లికార్జున్‌రెడ్డి

ఊరికి ఆనుకునే కాల్వలు ఉన్నా..

ఎర్రంబెల్లి మీదుగా అటు కాళేశ్వరం కాల్వ, ఇటు బునాదిగాని కాల్వ వెళ్తున్నాయి. రెండూ మీటర్ల దూరంలోనే ఉన్నాయి. గతంలో బునాదిగాని కాల్వకు నీళ్లు వదిలేవారు. బునాదిగాని చెరువు నిండేది. ఈసారి కాల్వతోపాటు బునాదిగాని చెరువు కూడా ఎండిపోయింది. అనాజిపురం చెరువు కూడా ఎండిపోయే దశకు చేరడంతో నీళ్లు వదలడం లేదు. ఫలితంగా భూగర్భ జలాలు ఇంకి.. సాగునీటికి కష్టాలు తప్పడం లేదు. మరోవైపు కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం కాల్వ కూడా వృథాగా ఉంటున్నది. బస్వాపూర్ నుంచి కాల్వ వచ్చే మార్గంలో కలెక్టరేట్ సమీపంలో జాతీయ రహదారి వద్ద లింక్ పూర్తి కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా కనీసం పట్టించుకోలేదు. బస్వాపూర్ నుంచి జలాలను విడుదల చేస్తున్నా లింక్ లేకపోవడంతో ఎర్రంబెల్లి కాల్వకు నీళ్లు రావడంలేదు.

ఎండిన పాలంలో కనిపిస్తున్న ఈ యువ రైతు పేరు మల్లికార్జున్‌రెడ్డి. ఊరు ఎర్రంబెల్లి. మూడెకరాల భూమి ఉంది. సాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉందని గ్రహించి ఎకరం మాత్రమే సాగు చేశాడు. ఇప్పుడు ఆ ఎకరం కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. భూగర్భ జలాలు అడుగంటడం, బోర్లు ఎండిపోవడంతో నీళ్లకు నానా కష్టాలు పడ్డారు. అక్కడకక్కడ పచ్చగ ఉన్న పంటనైనా కాపాడుకోవాలని ట్యాంకర్ ద్వారా నీళ్లు పెడుతున్నాడు. రోజుకు ఐదు నుంచి పది ట్యాంకర్ల నీళ్లు కొనుగోలు చేస్తున్నాడు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.500 అవుతున్నట్లు మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. ఈ గ్రామంలోని అనేక మంది రైతులు ఇదే పరిస్థితి.

సాయంత్రం తర్వాత జనరేటరే దిక్కు..

నేను తొమ్మిదెకరాల్లో వరి పెట్టాను. ఐదు బోర్లు ఉంటే నాలుగు ఎండిపోయాయి. ఇప్పటికే ఎకరం వరకు పంట ఎండిపోయింది. పంట చివరి దశకు వచ్చింది. ఎట్లయినా కాపాడుకోవాలని అరకిలోమీటరు దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నా. అందుకు పైపులకే 30 వేల రూపాయలు అయినయ్. ప్రభుత్వం సాయంత్రం 5గంటల నుంచి కరెంట్ సరఫరా బంద్ చేస్తుండడంతో ఐదింటి నుంచి రాత్రి 11గంటల వరకు జనరేటర్ వాడుతున్న. అప్పుడైతే జర నీళ్లు వచ్చే అవకాశం ఉంటున్నది. గంటకు మూడు లీటర్ల డీజిల్ పడుతున్నది. రోజుకు 1,500 నుంచి 2వేల రూపాయలు డీజిల్‌కే అయితున్నయ్. వారం, పది రోజులైతే పంట చేతికొస్తది. మాకు బునాదిగాని కాల్వ ఉన్నా ఈసారి నీళ్లు లేక ఎండిపోయింది. కాళేశ్వరం కాల్వకు లింక్ ఇస్తే ఇన్ని బాధలు ఉండేవి కాదు.

- పడమటి మధూసదన్ రెడ్డి, రైతు, ఎర్రంబెల్లి

బీఆర్ఎస్‌కేవీకి ఓటేస్తే ప్రతీ కార్మికుడికి రూ.18వేల వేతన ఒప్పందం

పెద్దకందుకూరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి

- బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి
- పెద్దకందుకూరులో పీఈఎల్ కంపెనీ వద్ద గేట్ సమావేశం

యాదగిరిగుట్ట, మార్చి 27 : ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో జరిగే అధికార కార్మిక ఎన్నికల్లో బీఎంఎస్ బలపర్చిన బీఆర్ఎస్‌కేవీ గెలిపిస్తే ప్రతి కార్మికుడికి రూ.18వేల వేతన ఒప్పందాన్ని సాధిస్తామని బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో గురువారం బీఆర్ఎస్‌కేవీ గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో 10,11వ వేతన ఒప్పందాల్లో బీఆర్ఎస్‌కేవీ కార్మికులు మెచ్చే వేతన ఒప్పందాన్ని సాధించిందని గుర్తుచేశారు. తమ సొంత నిధులతో రెండేండ్లపాటు హెల్త్ ఇన్సూరెన్స్ అందించామన్నారు. 10వ వేతన ఒప్పందంలో ఈఎస్ఐ కోల్పోయిన కార్మికులకు సంవత్సరానికి రూ.2 లక్షల వైద్య బీమాకు రూ.3,984 ఇప్పించామన్నారు. 11వ వేతన ఒప్పందంలో గరిష్టంగా రూ. 5,267, కనిష్టంగా రూ 5,230 వరకు వేతనాలు సాధించామని తెలిపారు. రెండు అగ్రిమెంట్లు కలుపుకొని రూ.11,517 వరకు జీతభత్యాలను పెంచి కార్మికులకు దన్నుగా నిలిచినట్లు పేర్కొన్నారు. శిక్షణలో కార్మికులకు రూ.5వేల నుంచి రూ.12 వేల వరకు వేతనం పెంచామన్నారు. జూనియర్ కార్మికులకు యజమాన్యాన్ని ఒప్పించి అగ్రిమెంట్‌ను వర్తింపజేసి, ఏరియల్స్‌ను సాధించిన ఘనత బీఆర్ఎస్‌కేవీకే దక్కుతుందన్నారు. రూ.1,500 ఉన్న ఫెస్టివల్ అడ్వాన్స్‌ను రూ.6,500 వరకు పెంచామన్నారు. గతంలో కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఒక ఉద్యోగం, రూ.20 లక్షల నష్టపరిహారం మాత్రమే ఇప్పించారని, బీఆర్ఎస్‌కేవీ నాయకత్వంలో రూ.35 లక్షల పరిహారంతోపాటు కుటుంబానికి రెండు ఉద్యోగాలు ఇప్పించామని తెలిపారు. మరోసారి బీఆర్ఎస్‌కేవీకి అవకాశం ఇస్తే కార్మికుల శ్రేయస్సు కోసం రెట్టింపు ఉత్సాహంతో 12వ వేతన ఒప్పందాన్ని సాధిస్తామన్నారు. ప్రతి కార్మికుడికి రూ. 16 వేల వేతన ఒప్పందంతోపాటు స్టాఫ్ కార్మికులకు అదనంగా రూ.600 అందజేసేలా కృషి చేస్తామన్నారు. ఈఎస్ఐ పరిధి దాటిన ప్రతి కార్మికుడి కుటుంబానికి సంవత్సరానికి రూ.7 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని పూర్తిగా యజమాన్యమే భరించేలా చూస్తామని తెలిపారు. అర్హులైన కార్మికులందరికీ పదోన్నతులు సాధిస్తామన్నారు. వీడీఏ పాయింట్ ప్రస్తుతం ఉన్న 2 రూపాయల నుంచి 3కి, ఎల్‌టీఏ రెట్టింపు వచ్చేలా పని చేస్తామన్నారు. పండుగ సెలవులు, ఎస్ఎల్, సీఎల్స్ మంజూరుకు పాటుపడుతామని పేర్కొన్నారు. స్టాఫ్, వర్కర్స్ రిటైర్‌మెంట్ సమయంలో ఒక నెల వేతనాన్ని గిఫ్ట్‌గా అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, మెరుగైన మౌలిక సౌకర్యాలను కల్పిస్తామన్నారు. పీఈఎల్ యజమాన్యాన్ని ఒప్పించి కార్మికుల పక్షాల నిలిచే బీఆర్ఎస్‌కేవీ బాణం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు చెన్నకేశవరావు, గౌరవాధ్యక్షుడు వై.రాజిరెడ్డి, బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జలంధర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రాంబాబు, జిల్లా సెక్రటరీ జోగిరెడ్డి, కోశాధికారి ఎల్లగౌడ్, బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం ప్రధాన కార్యదర్శి బరిగే నర్సింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, డిప్యూటి సెక్రటరీ పాపయ్య, కోశాధికారి గవ్వల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గట్టికొప్పుల లక్ష్మీనర్సయ్య, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెంటికి చెడ్డ రైతన్న

అటు వరి, ఇటు మిర్చి పశువుల పాలు

ఆత్మకూర్.ఎస్ మండలంలో నీళ్లు లేక ఎండిన పంటలు

ఆత్మకూర్.ఎస్, మార్చి 27 : ఆత్మకూర్.ఎస్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరితోపాటు మిర్చి కూడా సాగు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎస్సారెస్పీ కాల్వల్లో నీళ్లు వస్తాయని భావించి వేలకు వేలు పెట్టుబడి పెట్టారు. కానీ, నీళ్లు రాక రెండు పంటలూ ఎండిపోవడంతో ఆర్థికంగా కుంగిపోయి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండిన పొలాల్లో పశువులు, గొర్లు, మేకలు మేపుతున్నారు. మిర్చి పంట దాదాపు 250 ఎకరాల్లో ఎండిపోవడం గమనార్హం. రామోజీతండాకు చెందిన షేక్ రహీమ్ తనకున్న ఎనిమిది ఎకరాల్లో మూడెకరాల్లో మిర్చి, ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కాళేశ్వరం నీళ్లు రాకపోవడంతో రెండు పంటలూ ఎండిపోయాయి. దాంతో పశువులను మేపుతున్నాడు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పొలాలకు 24గంటలు నీళ్లు వచ్చేవని, ఎక్కడా ఎకరం కూడా బీడుగా లేదని రహీమ్ చెప్తున్నారు. ఇప్పుడు నీళ్లు లేక పంటలు ఎండి పెట్టుబడికి తెచ్చిన అప్పులు మీద పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే తండాకు చెందిన మహిళా రైతు షేక్ చాంద్‌బీ ఐదెకరాల్లో రెండెకరాల్లో వరి, ఎకరన్నరలో మిర్చి తోట సాగు చేశారు. నీళ్లు లేక పంటలు పూర్తిగా ఎండిపోవడంతో పశువులను మేతకు వదిలిపెట్టారు. కాల్వ నీళ్లు లేకపోవడం వల్ల బోర్లు కూడా ఎండిపోయి రైతులు గోస తీస్తున్నారని చాంద్‌బీ ఆవేదన చెందారు.

రామోజీ తండాలో ఎండిన మిర్చి, పొలంలో పశువులు, జీవాలను మేపుతున్న రైతులు

బోరుమంటున్న బోడంగిపర్తి

భూగర్భ జలాలు అడుగంటి వట్టిపోతున్న బోర్లు

కండ్ల ముందే ఎండిపోతున్న పంటలు కాపాడుకునేందుకు రైతుల ప్రయత్నాలు చేతికందాల్సిన పంట పశువుల పాలు..

బోడంగిపర్తిలో పంట పొలం ఎండిపోవడంతో మేకలు, గొర్లను మేపుతున్న తోటకూరి యాదయ్య

చండూరు, మార్చి 27 : మునుగోడు నియోజకవర్గం చండూరు మండలంలోని బోడంగిపర్తి గ్రామంలో సాగునీరు లేక ఎక్కడికక్కడ పంటలు ఎండుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లలో నీళ్లు రావడం లేదు. వచ్చినా ఆగి ఆగి పోస్తుండడంతో వరి చేలకు ఎటూ సరిపోవడం లేదు. కండ్ల ముందే పంటలు ఎండిపోతుంటే కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామానికి చెందిన కట్కూరి నర్సింహ అనే రైతు నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. రెండు బోర్లు ఉండగా ఒకటి పూర్తిగా ఎండిపోయింది. మరొక బోరు ఆగి ఆగి పోస్తున్నది. దాంతో ఇప్పటికే కొంత సగం ఎండడంతో పశువుల మేతకు వదిలిపెట్టాడు. మిగిలిన పంట అయినా చేతికి వస్తే కొంత ఊరట లభిస్తుందని ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొనుగోలు చేసి పోస్తున్నాడు. రోజుకు రూ.2వేల నుంచి 3వేల వరకు ఖర్చు వస్తున్నట్లు నర్సింహ తెలిపారు. బోడంగిపర్తి గ్రామంలో 384 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, ఇప్పటికే 48 ఎకరాలు ఎండిపోయింది. ఎకరాకు రూ.30వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడి వచ్చిందని రైతులు చెప్తున్నారు. పంట ఎండిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నీళ్లు లేక నాలుగెకరాలు ఎండింది

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత నాటి కేసీఆర్ ప్రభుత్వం చెరువుల్లో పూడిక తీయడంతో పదేండ్ల పాటు నీళ్లకు ఢోకా లేదు. పంటలు బాగా పండించుకున్నాం. ఈ యాసంగిలో నాది, మా తమ్ముడి భూమి కలిపి ఎనిమిదెకరాల్లో వరి నాటు పెట్టిన. బోర్లల్లో నీళ్లు లేక నాలుగు ఎకరాలు ఎండింది. చేసేది లేక గొర్లు, మేకలను మేపుతున్నా.

-తోటకూరి యాదయ్య, రైతు, బోడంగిపర్తి

బోడంగిపర్తిలో వాటర్ ట్యాంకర్‌తో వరిచేనుకు నీళ్లు పెడుతున్న రైతు కట్కూరి నర్సింహ

మాజీ సర్పంచ్‌ల నిర్బంధం

- అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముందస్తు అరెస్టులు
- కాంగ్రెస్ సర్కార్ తీర్పుపై భగ్గుమన్న మాజీ సర్పంచులు

దామరచర్ల : వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో అరెస్ట్‌అయిన మాజీ సర్పంచులు

రామగిరి, మార్చి 27 : పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న మాజీ సర్పంచ్‌లపై ప్రభుత్వం నిర్బంధకాండను కొనసాగిస్తున్నది. బిల్లుల కోసం దశల వారీగా ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచ్‌లు గురువారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా పోలీసులు ముందస్తు అరెస్టులతో మాజీ సర్పంచ్‌లను అడ్డుకున్నారు. తెల్లవారుజాము నుంచే అక్కడికక్కడ అదుపులోకి తీసుకుని ఆయా స్టేషన్లకు తరలించారు. సాయంత్రం వరకూ స్టేషన్‌లో ఉంచారు. చందంపేట, నార్కట్‌పల్లి, నకిరేకల్, కట్టంగూర్, తిరుమలగిరి (సాగర్), దామరచర్ల, పాలకవీడు, రాజాపేట మండలాల్లో పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌ల అరెస్టులు కొనసాగాయి. కాంగ్రెస్ ఎన్నికల కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తుంటే అరెస్టులతో అడ్డుకోవడం అన్యాయమంటూ మాజీ సర్పంచ్‌లు మండిపడుతున్నారు.

పాలకవీడు పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు

బీబీనగర్ చెరువును కాపాడండి

- పెద్దచెరువులోకి డ్రైనేజీ నీరు
- హామీల అమలులో ఎమ్మెల్యే కుంభం విఫలం
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాదయాత్ర.. నిరసన

బీబీనగర్, మార్చి 27 : బీబీనగర్ పెద్దచెరువును పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఇప్పుడు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. చెరువులో డ్రైనేజీ మురుగు కలుస్తున్నా సమస్యను పరిష్కరించడం లేదని మండిపడ్డారు. ఈ మేరకు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గోలి సంతోశ్‌రెడ్డి ధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. చెరువులో కలుస్తున్న మురుగునీటి కాల్వలను పరిశీలించి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. అక్కడున్న గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు పిట్టల అశోక్ చుట్టూ ఇరవై గ్రామాలకు భూగర్భ జలాలు అందిస్తూ వేలాది ఎకరాలకు ఆయువు పట్టుగా నిలుస్తున్న బీబీనగర్ పెద్ద చెరువును కాలుష్యం బారి నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. బీబీనగర్, రంగాపురం, ఎయిమ్స్, జైనపల్లి నుంచి డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా మళ్లించేందుకు పనులు చేపట్టాలని కోరారు. బీబీనగర్ చెరువులో కాలుష్యం కారణంగా చేపలు చనిపోతుండడంతో వందలాది మత్స్యకార కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ఎమ్మెల్యేకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా చలనం లేకపోవడం శోచనీయమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం బీబీనగర్‌కు చేసిందేమీ లేదని విమర్శించారు. ఇకనైనా ఎమ్మెల్యే స్పందించకపోతే ఆయన తదుపరి బీబీనగర్ పర్యటనను బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఉద్యమాలతో అడ్డుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెంగల వెంకటకిషన్‌రావు, మాజీ సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుంటిపల్లి లక్ష్మీనారాయణ, ఎర్రోళ్ల కృష్ణ, దేవరకొండ శ్రీనివాస్, కట్ట నరేష్, చింతపట్ల నరహరి, వంగరి పరాకుశం, కుశంగల మురళి, బోయిన కృష్ణ, పంజాల ఈశ్వర్ గౌడ్, పొట్ట శ్రీనివాస్, పేరబోయిన నరేశ్, మర్రి శ్రీకాంత్, ముత్తోజు అశోక్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కలుషితమవుతున్న బీబీనగర్ పెద్ద చెరువును కాపాడాలని నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు